క్లుప్తంగా

బాధితులను ఆదుకుంటాం

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం తిమ్మాజిపేట మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. తెగిన ఇప్పలపల్లి తండా చెరువును, కూలిన ఇళ్లను, జెడ్పీహెచ్‌ఎస్ ప్రహరీని, పరిశీలించారు. అదేవిధంగా గోరిటలో పెద్ద చెరువు తెగిపోవడంతో ఏఓ కమల్‌కుమార్‌తో కలిసి కొట్టుకుపోయిన పంటలను పరిశీలించి నష్ట పరిహారాన్ని అంచనా వేశారు. నేరేళ్లపల్లిలో చెరువు అలుగు పారడంతో పూజ లు నిర్వహించారు. తహసీల్దార్ మోహన్, అధికారులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

తాడూరు: మండలంలోని పాపగల్, శిర్సవాడ, గోవిందాయిపల్లి, ఎటిదారిపల్లి, ఐతోల్, అంతారం, యాదిరెడ్డిపల్లి గ్రామాలను ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి సందర్శించారు. శిర్సవాడలో వరదలో చిక్కుకున్న మూగజీవాలను కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. నాయకులు మల్లేష్, కొండ నాగేష్, అల్లోజి, వెంకటయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

పెద్దకొత్తపల్లి: జొన్నలబొగుడ గ్రామానికి చెందిన తేజ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ. 60 వేలు, అదేవిధంగా రాంబాబుకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పజియానాయక్, కురుమూర్తి, ధర్మేందర్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

బల్మూర్: మండల కేంద్రంలో సోమవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మహిళలు పూనకాలు ఊగారు. ఆదివారం రాత్రి గ్రామంలో కోటమైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, మహిళలు ఉన్నారు. పాల్గొన్నారు.

పోషణ అభియాన్‌పై అవగాహన

లింగాల: పోషణ అభియాన్ పథకం అమలులో భాగంగా సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో లింగాల సీహెచ్‌సీ, అంబట్‌పల్లి పీహెచ్‌సీలలో ఈ నెలలో నిర్వహించే పోషణమాసం అమలు కోసం సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి పోషణ అభియాన్ అమలుపై అంగన్‌వాడీ టీచర్లకు, ఏఎన్‌ఎంలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శివశంకర్, అనిల్‌కుమార్, సుష్మా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, గిరిజ, ఏఎన్‌ఎం మంగ్లీబాయి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

కోడేరు: వినాయక విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఐ గోకారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 7 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. కమిటీ సభ్యులు తప్పనిసరిగా నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

ఊర్కొండ: మండలంలోని బొమ్మరాజు పల్లిలో అటవీ శాఖ అధికారులు సోమవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అడవి జంతువుల దాడిలో మూగజీవాలు మృతి చెందుతుండటంతో ఏర్పాటు చేసినట్లు అటవీశాఖ సిబ్బంది చంద్రుడు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన దంపతులు దండు యాదమ్మ, బాలయ్యలు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సింగల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ ఆస్పత్రిలో బాధితులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. పుల్లయ్య, కృపానందం తదితరులు ఉన్నారు.

కాల్వను పరిశీలించిన డీఈ

వెల్దండ: కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన డి–82 కాల్వ ద్వారా కేఎల్‌ఐ నీరు మండల కేంద్రానికి చేరుకుంది. గ్రామంలో కాల్వ ప్రమాద భరితంగా ఉందని రైతులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి ఇరిగేషన్ ఈఈ శ్రీకాంత్‌కు ఫోన్‌చేసి సమస్యను వివరించారు. ఈ మేరకు డీఈ సమ్మయ్య సోమవారం కాల్వను పరిశీలించారు. కాల్వలో రైతులు దాటేందుకు అమర్చిన సిమెంట్ పైపుల వద్ద కాల్వలో రాళ్లు అడ్డుగా ఉన్నట్లు గుర్తించారు. కాల్వ ప్రమాదానికి గురికాకుండా త్వరలో రాళ్లను తొలగిస్తామని ఆయన పేర్కొన్నారు.

కోటబురుజుకు మరమ్మతు చేపడుతాం

కల్వకుర్తిరూరల్: భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో ఉన్న కోట బురుజుకు మరమ్మతు చేపడుతామని తహసీల్దార్ ఇబ్రహీం అన్నారు. సోమవారం బురుజును ఆయన పరిశీలించారు. మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, కౌన్సిలర్ శ్రీధర్‌రెడ్డి, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రేష్మాబేగం ఉన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్, మంచాలకట్ట, మల్లేశ్వరం, వేముకల్, సోమశిల, కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లొద్దని ఎస్‌ఐ రామన్‌గౌడ్ మత్స్యకారులకు సూచించారు. మంచాలకట్ట గ్రామంలో మత్స్యకారులతో మాట్లాడారు. హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య, రాము తదితరులు పాల్గొన్నారు. పెంట్లవెల్లి, మంచాలకట్ట మధ్యలో ఉన్న వాగు బ్రిడ్జిపై పారుతుండడంతో మంచాలకట్ట, మాధవస్వామినగర్ గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎంగంపల్లి తండా మీదుగా మండల కేంద్రానికి చేరుకుంటున్నారు.


మంచాలకట్టకు వెళ్లే దారిలో బ్రిడ్జిపై పారుతున్న నీరు

ఊర్కొండ: మండలంలోని రాంరెడ్డిపల్లిలో కూలిన, శిథిల ఇళ్లను ఎంపీడీఓ కృష్ణయ్య సందర్శించారు. బాధితులను ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు తరలించారు. జగబోయినాపల్లిలో జాబ్ కార్డుల అప్‌డేట్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం బాల్యలోక్య తండాను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్ నాయక్, ఏపీఓ నరసింహులు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఊర్కొండ మండలం జగబోయిన్‌పల్లిలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణయ్య

చెరువులకు జలకళ

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- స్తంభించిన జనజీవనం
- పంటలను పరిశీలించిన అధికారులు
- దెబ్బతిన్న రహదారులు


కొల్లాపూర్ మండలం రామాపురంలో వాగు ఉధృతి కారణంగా నీటమునిగిన వరిచేన్లు


నీటితో కళకళలాడుతున్న కేసరి సముద్రం వాగు

నాగర్‌కర్నూల్‌రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా చెరువులు, కుంటలు నిండి అలుగులు పారుతున్నాయి. వరద ఉధృతి తగ్గకపోవడంతో జనజీవనం స్తంభించింది. మండలంలోని నాగసముద్రం, సత్యసముద్రం, కేసరి సముద్రం చెరువుల అలుగుల నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో నాగర్‌కర్నూల్ నుంచి నాగనూల్‌కు, ఎండబెట్ల, మంతటి గ్రామాల మధ్య అధికారులు రాకపోకలను నిలిపివేశారు. నాగర్‌కర్నూల్ పట్టణ సమీపంలోని కేసరి సముద్రం చెరువు, నాగసముద్రం చెరువు వద్ద సందర్శకులు సందడి చేశారు.

కొల్లాపూర్: మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొల్లాపూర్‌లో సోమవారం రోజంతా వాగులు పొంగిపొర్లాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు కొల్లాపూర్ మండలంలో 50.2 మి.మీ, కోడేరు మండలంలో 48.8 మి.మీ, పెద్దకొత్తపల్లి మండలంలో 47.2 మి.మీ, పెంట్లవెల్లి మండలంలో 32 మి.మీ వర్షపాతం నమోదైంది. సోమవారం మధ్యాహ్నం నుంచి పొడి వాతావరణం మొదలైంది. పట్టణంలోని మూలవాగు ప్రవాహం సాయంత్రం వరకు కొనసాగింది. చౌటబెట్ల నుంచి తాళ్లనర్సింగాపురం గ్రామానికి వెళ్లే మార్గంలో గల వంతెనకు అటాచ్‌గా ఉన్న రోడ్డు కోతకు గురైంది. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎన్మన్‌బెట్ల గ్రామ సమీపంలోని వాగు ఉప్పొంగడంతో ఆ గ్రామానికి వెళ్లే రహదారిలో రెండు రోజులుగా రాకపోకలు ఆగిపోయాయి. గ్రామస్తులు సింగోటం మీదుగా ప్రయాణాలు సాగిస్తున్నారు. రామాపురం సమీపంలోని పెద్దవాగు ఉధృతి కారణంగా సమీపంలోని పంటపొలాలు నీటమునిగాయి. పలువురు రైతులకు చెందిన భూములు కోతలకు గురయ్యాయి. నీటిముంపు ప్రాంతాలను కొల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు పలువురు నాయకులు పరిశీలించారు.

కొల్లాపూర్ రూరల్: ముక్కిడిగుండం గ్రామ సమీపంలో ఉన్న పెద్ద వాగు ఉప్పొంగి ప్రవహించడంతో ముక్కిడిగుండం, గేమ్యానాయక్ తండాలకు రాకపోకలు నిలిచిపోయాయి.


ముక్కిడిగుండం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు


నిండుకుండలా వెనచర్ల పెద్ద చెరువు

పెద్దకొత్తపల్లి: మండలంలో 101 చిన్నచెరువులు, కుంటలు, 12 నోటిఫైడ్ చెరువులు అలుగులు పారుతున్నాయి. వెనచర్ల గ్రామంలోని పెద్ద చెరువు అలుగు పారడంతో నక్కలపల్లి గ్రామానికి వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లి, అనంతసాగర్, చిన్నముద్దునూరు, దాసుపల్లి, గౌరారం ఊరచెరువు, పర్వతాపురం ఊరచెరువు, తెలకపల్లి పెద్ద చెరువు, గౌరెడ్డిపల్లి, లక్నారం, ఆలేరుతోపాటు పెద్దూరు గ్రామాలలో ఉన్న మూడు చెరువులు పూర్తిగా నిండాయి.

అమ్రాబాద్: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అమ్రాబాద్, పదర మండలంలో వాగులు పొంగి పారడంతో చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి.

నాగర్‌కర్నూల(బిజినేపల్లి) :లట్టుపల్లిలో కేఎల్‌ఐ కాల్వ తెగిపోవడంతో వరి పంట వందల ఎకరాల్లో నష్టం జరిగిందని రైతులు ఏవో నీతికి వివరించారు. మంగనూర్, వెల్గొండ గ్రామ శివార్లలో పంట నష్టాన్ని రైతులతో కలిసి అంచనా వేశారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలో 240 ఎకరాలలో వరి పంట నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు. మండంలోని కుడికిల్లలో వరి పంట నీటి మునిగింది.

బల్మూర్: మైలారం, వీరంరాజ్‌పల్లి చెరువులు నిండి పారుతుండటంతో బల్మూర్–అచ్చంపేట ప్రధాన రహదారిలోని కల్వర్టుల వద్ద చేపలు పడుతున్నారు.

తాడూరు: మండలంలోని చర్లతిరుమలాపురం జల దిగ్బంధం అయ్యింద.ఇ గ్రామం నుంచి ఇతర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చర్లటిక్యాల, నాగుల చెరువు అలుగునీరు కాల్వ తెగిపోయి వరద గ్రామంలోని ఇళ్ల దగ్గరకు చేరుకున్నాయి.

నీటిలో మునిగిన పంటలు

కోడేరు: మండలంలోని కురిసిన భారీ వర్షాలకు రైతులు సాగు చేసిన పంటలు నీటిలో మునిగిపోయాయి. రేకులపల్లిలో సాగు చేసిన వరి పంటనీటిలో మునిగింది. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్య యాదవ్ పంట పొలాలను సందర్శించి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

క్షేత్రస్థాయిలో అధికారుల సందర్శన

అమ్రాబాద్: మండలంలోని కల్ములోనిపల్లి, ఒంగురోనిపల్లి, మాచారం, వెంకటేశ్వర్లబావి తదితర గ్రామాల్లో మొత్తం 14 ఇళ్లు కూలాయని తహసీల్దార్ రావూఫ్ తెలిపారు. పదర మండలంలోని వంకేశ్వరంలో 10 పాత మిద్దెలు కురుస్తుండటంతోవారిని అప్రమత్తం చేసి ఇతర ఇళ్లలోకి మార్పినట్లు ఎంపీడీఓ సృజనాబాలచంద్రుడు, ఎంపీఈఓ వెంకటయ్యలు పేర్కొన్నారు.

పెద్దకొత్తపల్లి: మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలో 11 ఇళ్లు కూలినట్లు తహసీల్దార్ ఈసుఫ్అలీ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


కోతకు గురైన మల్లంకుంట రోడ్డు డ్యాం

అచ్చంపేట: పట్టణంలోని మల్లంకుంట రోడ్డు డ్యాం కోతకు గురై ప్రమాదభరితంగా మారింది. వర్షపు నీటి ఉధృతికి మల్లంకుంట వద్ద శ్రీశైలం ప్రధాన రహదారి సైతం నీట మునిగింది. నీటిని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరం, మంచాలకట్ట, ఎంగంపల్లి తండా, గోపులాపూర్, కొండూరు, పెంట్లవెల్లి గ్రామాల్లో పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. మండలంలోని 136 ఎకరాల వరి, 6 ఎకరాల వేరుశనగ, 10 ఎకరాల మొక్కజొన్న నీట మునిగాయి.


పెంట్లవెల్లిలో నీట మునిగిన వరిపంట

పంట పొలాలు పరిశీలించిన అధికారులు


తెలకపల్లి మండలంలో పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

తెలకపల్లి: మండలంలోని చిన్నముద్దునూరు, తెలకపల్లి, రాకొండ గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ చిన్నముద్దునూర్‌లో రుణమాఫీకి సంబంధించిన వివరాలను సేకరించారు. ఏఓ నర్మద, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రావ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇళ్లను..


నాగర్‌కర్నూల్ 11వ వార్డులో కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంతోపాటు గ్రామాల్లో కూలిన ఇళ్లను సీపీఎం బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందికొండ గీత మాట్లాడుతూ నిర్వాసితులుగా వెంటనే నష్ట పరిహారం చెల్లించి కొత్త ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. బాధితులను ఆదుకోవాలని కోరుతూ మండల కార్యదర్శి జి అశోక్ తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్ శ్రీనివాసులు, పాదిల రామయ్య, యాదయ్య, సత్యనారాయణ, మధు, క్రాంతి మల్లికార్జున్, రాహుల్, కురుమయ్య, మద్దిలేటి, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.


శిర్సవాడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ నది


తెలకపల్లి మండలం దాసుపల్లి చెరువు


నిండుకుండలా కొత్త చెరువు


బిజినేపల్లి మండలం లట్టుపల్లిలో..


కుడికిల్ల సమీపంలో నీట మునిగిన వరిపంట

వైఎస్‌ఆర్‌కు ఘన నివాళి


అచ్చంపేటలో వైఎస్‌ఆర్ వర్ధంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ


తిమ్మాజిపేటలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం నిర్వహించారు. అచ్చంపేటలో వైఎస్‌ఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులు చేపట్టిన ఘనత వైఎస్‌ఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. తిమ్మాజిపేటలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి హాజరై వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్‌ఆర్ ప్రజలకు చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో వైఎస్‌ఆర్ 15వ వర్ధంతిని నిర్వహించారు. ఉప్పునుంతల మండలం పోచమ్మ చౌరస్తా వద్ద ఉన్న వైఎస్‌ఆర్ విగ్రహానికి కార్మిక సంఘం నాయకులు పూలమాలలు వేసి వైఎస్‌ఆర్ సేవలను కొనియాడారు. అమ్రాబాద్ మండలం అంబేడ్కర్ చౌరస్తాలో మాజీ ఎంపీపీ అచ్చిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చయ్యలు హాజరయ్యారు. కొల్లాపూర్ పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో వైఎస్‌ఆర్ చిత్రపటానికి టీపీసీసీ సభ్యులు రంగినేని జగదీశ్వరుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలోని వైఎస్సార్ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యనాగరాజుతో పాటు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వంగూరు మండలంలోని వెంకటాపూర్ ప్రాథమిక పాఠశాలకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా గ్రామానికి చెందిన ఎడ్ల మల్లేష్ రూ.40 వేలు విలువ కలిగిన ఫర్నీచర్ అందజేశారు. వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, లింగాల మండలం రాయవరంలో వైఎస్‌ఆర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, కొల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మహిమూదాబేగం, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులుపాల్గొన్నారు.


ఉప్పునుంతలలో..


అమ్రాబాద్‌లో..


వెల్దండలో..

పౌష్టికాహారంతో ఆరోగ్యం

బల్మూర్: పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ ప్రశాంతి అన్నారు. పోషన్ అభియాన్ మాసంలో భాగంగా సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ నిర్మల, పోషన్ అభియాన్ కోఆర్డినేటర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేయొద్దు

అచ్చంపేట రూరల్: విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేష్‌ప్రసాద్ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నమోదు ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్‌గౌడ్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఊర్కొండ: మండల కేంద్రంలోని వెంకట బలరామయ్య పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఇంగ్లీష్, తెలుగు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలకు ఎంపికయ్యారు. ట్రాస్మా ప్రజ్ఞాన్ వికాస్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన తెలుగు ఇంగ్లీష్ వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో పాఠశాల విద్యార్థులు తెలుగు వ్యాసరచనలో జి.మణికంఠ, డి.జస్వంత్ రాయ్, ఇంగ్లీష్ వ్యాసరచనలో ఏ.రిక్షిత, చిత్రాలేఖనంలో ఓ.వైష్ణవి ఎంపికయ్యారు.

నాగనూల్ రోడ్డుపై బ్రిడ్జిని నిర్మించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ నుంచి నాగనూల్ వెళ్లే దారిలో నూతన బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని బీఎంపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గడ్డం విజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వరద ఉధృతిని ఆయన పరిశీలించి మాట్లాడారు. వరద ఉధృతి కారణంగా వాహనాల రాకపోకలను నిలిపివేశారన్నారు. ఈ రోడ్డు నుంచి నాగనూల్, వనపట్ల, గుడిపల్లి, పెద్దాపూర్, సానాయిపల్లి, నాగపూర్, బండరాయిపాకుల, రేవల్లి, కోడేరు, వనపర్తికి వెళ్లే బస్సులు రాకపోకలు కొనసాగిస్తాయని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, రత్నావత్‌హుస్సేన్‌నాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గడ్డం విజయ్

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



కోడేరు: మండలంలోని పస్పుల వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ వాగు వద్ద ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రవి, రాజేష్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి బావాయిపల్లి, పస్పుల, ఖానాపూర్ వాగులపై బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపూర్ గ్రామ సమీపంలో సర్వే నంబర్ 147లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాల నిర్మాణం కోసం ఆర్‌డీఓ నాగరాజు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ ఆదేశాల మేరకు స్థల పరిశీలన చేసినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ ప్రభాకర్, మంత్రి ఓఎస్‌డీ, సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

విషజ్వరాల నుంచి ప్రజలను కాపాడండి



నాగర్‌కర్నూల్‌రూరల్: విషజ్వరాల బారి నుంచి ప్రజలను కాపాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ కోరారు. ఈ మేరకు సోమవారం డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. వ్యాధుల నివారణ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు, డాక్టర్ల కొరత తీవ్రంగా ఉందన్నారు. దోమల నివారణకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో డెంగీ నివారణ కిట్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. డెంగీతో మృతిచెందిన కుటుంబాలకు ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు చింత ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు నందిపేట భాస్కర్, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.